క్లుప్తంగా

గరంగరం స్వీట్‌కార్న్



మారేపల్లి గేటు వద్ద స్వీట్‌కార్న్ విక్రయిస్తున్న చిరు వ్యాపారి

పెద్దేముల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు చిరు వ్యాపారస్తులు ఉపాధి కోల్పోతుండగా.. మరికొందరికి చేతినిండా పని దొరుకుతోంది. ఏ పనులు చేద్దామన్నా వర్షం ఆటంకం కలిగిస్తుండగా.. స్వీట్‌కార్న్ వ్యాపారులకు బాగా కలిసి వస్తోంది. తాండూరు–సంగారెడ్డి, తాండూరు–హైదరాబాద్ మార్గంలో పెద్దేముల్, మంబాపూర్ గ్రామాల వద్ద చిన్న వ్యాపారులు స్వీట్‌కార్న్ మక్కబుట్టలు ఉడక బెట్టి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. తాండూరు మార్కెట్ నుంచి మక్కబుట్టలు టోకున తీసుకొచ్చి, ఉడక బెట్టి, దానిపై నిమ్మ, ఉప్పురాసి విక్రయిస్తున్నారు. వాతావరణం చల్లగా ఉండడం, రుచితో పాటు పలుపోషకాలు ఉన్న మక్కబుట్టను తినడానికి ప్రజలు ఇష్టపడతారని, ఒక్కో బుట్టను రూ.15 నుంచి రూ.20 వరకు విక్రయిస్తున్నామని, అన్ని ఖర్చులు పోనూ రూ.300లకు పైగా ఆదాయం లభిస్తుందని వ్యాపారులు చెబుతున్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం



రామలింగేశ్వర ఆలయంలో విగ్రహాలకు పూజలు చేస్తున్న పండితుడు

తాండూరు రూరల్: జినుగుర్తిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామశివారులోని శ్రీ రామలింగేశ్వర పురాతన ఆలయంలో నూతన విగ్రహాలను ప్రతిష్ఠింపజేశారు. శనివారం దేవాలయంలో వినాయకుడు, సుబ్రమణ్య స్వామి, నాగేంద్రుడుతో పాటు నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించారు. ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు కరమ్‌చందు, మోహన్‌దాస్, ఉత్తమ్‌చందు, జగదాంబ, ప్రవీణ్‌గౌడ్, రఘు కిషోర్, అజ్మత్, హసీం అలీ, హిందూ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పద్మావతి అమ్మవారి జన్మదినోత్సవం



విశేష అలంకరణలో అమ్మవారు

కొడంగల్ రూరల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతి సమేత శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో శనివారం శ్రీ పద్మావతి అమ్మవారి జన్మదిన ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడుకలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ అనంతరం ఆస్థాన వేంచేపు నిర్వహించారు. ఆలయ మాడవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆఫీస్ మేనేజ్‌మెంట్ సభ్యుడిగా మారుతి



బీఎల్ సంతోష్‌తో మారుతికిరణ్

పరిగి: ఆఫీస్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్ సభ్యుడిగా బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ బూనేటిని పార్టీ ఎంపిక చేసింది. ఈ మేరకు శనివారం ఢిల్లీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కిరణ్‌ను బీజేపీ జాతీయ సంఘటన ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ ఎంపిక చేశారు.

మొహర్రం షురూ

కుల్కచర్ల: మొహర్రం పండుగ ప్రారంభమైంది. శుక్ర, శనివారం రాత్రి సమయాల్లో మండల కేంద్రంలోని అంగడిబజార్లో పీర్లను తయారు చేశారు. వారం రోజుల పాటు సంబురం సాగనుంది.



అంగడిబజార్‌లో ఏర్పాటు చేసిన పీర్లు

పండ్ల రైతుకు పండగ

రాయితీ ఇవ్వనున్న ప్రభుత్వం

- జిల్లాలో 1,575 ఎకరాల్లో సాగు లక్ష్యం
- ఈనెల చివరి వరకు దరఖాస్తులకు అవకాశం



మోమిన్‌పేటలో సాగవుతున్న డ్రాగన్‌ఫ్రూట్

దౌల్తాబాద్/బొంరాస్‌పేట/నవాబ్‌పేట: జిల్లా జనాభా అవసరాలకు అనుగుణంగా కూరగాయలు, పండ్ల ఉత్పత్తి లేదు. దీంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మరోవైపు దిగుబడులు తగ్గడంతో మార్కెట్లో డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రత్యమ్నాయంగా పండ్లు, కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జాతీయ ఉపాధిహామీ పథకంలో రైతులను పండ్ల తోటల పెంపకం వైపు మళ్లించడానికి రాయితీలను అందిస్తోంది. ప్రతి మొక్కకు నీటిని అందించేందుకు సబ్సిడీపై సూక్ష్మ సేద్య పరికరాలను ఇవ్వనుంది.

పంట	ఎకరా మొక్కలు	ఎకరాకు ఇచ్చే రూ.
మామిడి	70	54,606
నిమ్మ	110	69,403
నారింజ	100	63,118
జీడి మామిడి	70	54,186
జామ	110	70,063
సీతాఫలం	160	1,00,986
సపోట	60	47,264
ఆయిల్ పామ్	57	43,946
నేరేడు	40	31,120
ఆపిల్ బేర్	160	77,786
దానిమ్మ	265	1,21,499
మునగ	1000	94,892
డ్రాగన్‌ఫ్రూట్	900	2,50,272
కొబ్బరి	40	31,560

ఉద్యాన పంటలకు..

ఉపాధిహామీ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో 14 రకాల పండ్ల తోటలను జిల్లాలో 1,575 ఎకరాల్లో సాగు చేసేందుకు ప్రభుత్వం లక్ష్యం ఎంచుకుంది. ప్రస్తుత వాతావరణ మార్పులు, పరిస్థితులు, ఆరోగ్య సంరక్షణ, డెంగీ, కరోనా, పలు వైరస్‌ల వలన కలిగే అనారోగ్య లక్షణాల నుంచి సంరక్షణకు, రోగ నిరోధక శక్తి పెరగాలంటే డ్రాగన్ ఫ్రూట్, జామ, నిమ్మ, నేరేడు తదితర పండ్లతో పాటు.. మార్కెట్‌లో డిమాండు ఉన్న కూరగాయలు సాగు చేసుకోవాలి. అంతర పంటగా పలు ఆకుకూరలు, బీర, సోర, కాకర, చిక్కుడు, టమాట, దోస, మునగ, పూలు లాంటివి పండించుకోవచ్చు. వీటి సాగుకు ప్రభుత్వం రాయితీ ఇవ్వనుంది.

అర్హతలు

ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగి ఉండి, అనువైన భూమి, నీటి సౌకర్యం ఉండాలి. 5 ఎకరాల లోపు భూమి ఉన్న షెడ్యూల్డ్ కులాలు, తెగలు, చిన్న సన్నకారుల రైతులై ఉండాలి. రైతులకు రాయితీపై మొక్కలు, బిందుసేద్యం పరికరాలను ఎస్సీ,ఎస్టీ రైతులకు వందశాతం, మిగిలిన వారికి 90శాతం రాయితీపై పరికరాలు అందజేయనున్నారు. మొక్కలు నాటిన ఏడాది నుంచి మూడు నుంచి నాలుగేళ్ల వరకు నిర్వహణ ఖర్చులు ప్రభుత్వమే మంజూరు చేస్తుందని, ఉపాధి కూలీలతో గుంతల తవ్వకం మొక్కలు నాటే పనులు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.



దౌల్తాబాద్‌లో బత్తాయితోట

నెలాఖరు లోపు లబ్ధిదారుల ఎంపిక

ఉద్యాన, వ్యవసాయశాఖల సమన్వయంతో లక్ష్యం చేరుకునేలా ప్రణాళిక తయారు చేస్తున్నారు. అన్నదాతలు స్థానిక ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెలాఖరు వరకు లబ్ధిదారులను గుర్తించి, ఆగస్టు 15లోపు ప్రతిపాదనలు రూపొందిస్తారు. వచ్చే నెలాఖరు వరకు మొక్కలు నాటడం, బిందు సేద్యం పరికరాల బిగింపు పూర్తి చేయాల్సి ఉంటుంది.

❝ దరఖాస్తు చేసుకోవాలి



ఉపాధిహామీ జాబ్‌కార్డు ఉన్న చిన్న, సన్నకారు రైతులు ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలి. లాభదాయకమైన పండ్ల మొక్కలు పెంచుకొని ఆర్థికంగా ఎదగాలి. మండలానికి ఇచ్చిన 120 ఎకరాల లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

– తిరుమలస్వామి, ఎంపీడీఓ, దౌల్తాబాద్

అనుకూల సమయం



ఉపాధిహామీ పథకంలో భాగంగా 2023–24 సంవత్సరానికి పండ్ల తోటల పెంపకానికి ఇది అనుకూల సమయం. రైతులకు ఎలాంటి ఖర్చు లేకుండా మూడేళ్ల పాటు యాజమాన్య పనులు ప్రభుత్వమే చేయిస్తుంది. అర్హత, ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తులను ఏపీఓ(ఉపాధిహామీ)కు అందజేయాలి.

– మల్లికార్జున్, ఏపీఓ, బొంరాస్‌పేట

రైతు ఖాతాలో రాయితీ జమ



రాయితీని నగదు రూపంలో రైతు రన్నింగ్ బ్యాంక్ ఖాతాలో జమచేస్తారు. రైతులు సమీప పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్‌అసిస్టెంటు, టెక్నికల్ అసిస్టెంటు, ఈసీ, ఏపీఓ, వ్యవసాయ విస్తరణ అధికారి, ఉద్యాన, సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల పరిషత్ అధికారి తదితర శాఖల అధికారులను సంప్రదించి ఈ నెల చివరి వరకు ధరఖాస్తు చేసుకోవాలి.

– అబ్దుల్‌గఫార్, ఉద్యానశాఖ అధికారి, వికారాబాద్

నేడు కవిసమ్మేళనం

కొడంగల్ రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించనున్న కవి సమ్మేళన కార్యక్రమంలో కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులు, తెలుగు భాషాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక జిల్లా కార్యవర్గ సభ్యుడు మాసాని వెంకటయ్య కోరారు. ఈ మేరకు ఆయన శనివారం మాట్లాడారు. దాశరథి కృష్ణమాచార్య, సింగిరెడ్డి నారాయణరెడ్డి జయంతి సందర్భంగా ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు ఎరన్‌పల్లి శ్రీనివాస్, బత్తుల మల్లయ్య, పండరీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

కొడంగల్ రూరల్: పెద్దనందిగామ 33/కేవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నవీన్‌కుమార్ తెలిపారు. ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు 11కేవీ పెద్దనందిగామ ఫీడర్, 11కేవీ చిన్ననందిగామ ఫీడర్, 11కేవీ నందారం ఫీడర్, 11కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

త్వరగా మొక్కలు నాటాలి

దౌల్తాబాద్: వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీలో త్వరగా మొక్కలు నాటాలని ఎంపీడీఓ తిరుమలస్వామి సూచించారు. శనివారం దౌల్తాబాద్ మండలం చల్లాపూర్‌లో రోడ్డు పక్కన నాటుతున్న మొక్కలను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామ పంచాయతీకి ఇచ్చిన లక్ష్యం మేరకు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని సూచించారు. ఆయన వెంట టీఏ కృష్ణహరి ఉన్నారు.

బీమాకు దరఖాస్తు చేసుకోండి



యాలాల: క్రాప్‌బుకింగ్ యాప్ ద్వారా పంటల వివరాలు నమోదు చేస్తున్న ఏడీఏ రుద్రమూర్తి



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో రైతుబీమా నమోదు చేస్తున్న ఏఈఓ శ్రీనివాస్

- చివరి తేదీ ఆగస్టు 5
- మండల వ్యవసాయ అధికారులు

మోమిన్‌పేట: రైతుబీమాకు ఆగస్టు 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ శ్రీనివాస్ తెలిపారు. జూన్ 19లోపు పట్టాదారుగా పాసుపుస్తకం పొందిన రైతులు అర్జీకి అర్హులని చెప్పారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, నామిని ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకాల జిరాక్సులను రైతుబీమా ఫారానికి జతచేసి రైతు వేదిక క్లస్టర్లో ఏఈఓలకు అందజేయాలని సూచించారు. ఆదే విధంగా రైతులు సాగు చేసిన పంట వివరాలను తెలపాలని పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

యాలాల: ఆరవ పాలసీ పథకంలో భాగంగా కొత్తగా పట్టా పాసుపుస్తకాలు పొందిన రైతులు తప్పనిసరిగా రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ తాండూరు ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. యాలాల మండలం అగ్గనూరు, మల్‌రెడ్డిపల్లిలో క్రాప్ బుకింగ్ అనౌన్స్‌మెంట్ యాప్ ద్వారా పంటలను పరిశీలించారు. అనంతరం రైతులకు రైతుబీమాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ గోపి తదితరులు ఉన్నారు.

ప్రయోగాత్మకంగా ఆలు సాగు

ఎకరాలో నారుతో పంట



ఆలు నారును నాటుతున్న రైతు రాజు

మర్పల్లి: జిల్లాలోనే మొదటి సారి వర్షాకాలంలో ప్రయోగాత్మకంగా ఒక ఎకరాలో నారుతో ఆలు సాగుకు శ్రీకారం చుట్టారు. మర్పల్లి మండలం దమాస్తాపూర్ గ్రామంలో యాదగిరి, గోవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, మర్పల్లిలో రాజుల వద్ద 0–10గుంటల చొప్పున ప్రయోగాత్మకంగా సాగును చేపట్టారు. పూర్తిగా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులు నారు వేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు సమీపంలోని హసన్ ల్యాబు నుంచి కుఫ్రి హిమాలిని అనే రకం ఆలు నారును హైదరాబాద్‌కు తీసుకువచ్చామని ఉద్యానశాఖ అధికారి గఫూర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆలు కేంద్రం, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నారును రైతులకు ఉచితంగా సరఫరా చేశామని, ఇండోనేషియా దేశం టెక్నాలజీ ద్వారా కర్ణాటకలోని హసన్‌లో ఆలు సాగును ఇంటర్‌నేషనల్ పోటాటో సెంటర్ ఆధ్వర్యంలో వర్షాకాలంలో పండిస్తున్నామని వెల్లడించారు. వానాకాలంలో వచ్చే దిగుబడిలో చిన్న సైజు ఆలు, యాసంగిలో పెద్దసైజు ఆలు అమ్మకానికి వస్తుందని, అదే పద్ధతిలో ఇక్కడ వర్షాకాలంలో ఆలు నారు విజయవంతమైతే యాసంగి విత్తనానికి ఆగ్రా వెళ్లాల్సిన అవసరం లేదని గఫూర్ వివరించారు. పొలంలో బెడ్ తయారు చేసుకొని, ఫీటు దూరంలో రెండు వరుసల నారును నాటుకోవచ్చని తెలిపారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

- విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు
- సంబంధిత అధికారులతో మున్సిపల్ కమిషనర్ షఫీవుల్లా



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

తాండూరు టౌన్: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ షఫీవుల్లా ఆదేశించారు. శనివారం ఆయన కార్యాలయంలో మున్సిపల్ పారిశుద్ధ్య, టౌన్ ప్లానింగ్, వాటర్ సప్లై, హరితహారం, వీధి దీపాలకు సంబంధించిన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వానలు పడుతున్నందున పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, మురుగు కాలువలను శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, నీటి కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయడం, ఫాగింగ్, స్ప్రేయింగ్ వంటి పనులు పారిశుద్ధ్య కార్మికులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.

ఆక్రమణలు గుర్తించాలి

తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకోవాలని, లీకేజీలను అరికట్టుట, ట్యాంకుల క్లీనింగ్, బ్లీచింగ్ వేయటం, తాగునీరు కలుషితం కాకుండా నీటి సరఫరాపై శ్రద్ధ చూపాలని కమిషనర్ అన్నారు. మురుగుకాలువలు, రోడ్డు ఆక్రమణ, అక్రమ కట్టడాల వంటివి టౌన్ ప్లానింగ్ విభాగం గుర్తించాలన్నారు. విద్యుద్దీపాల నిర్వహణ, దీపాల ఏర్పాటు తదితర విషయాలపై ఆయా విభాగం శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. సమావేశంలో డీఈఈ రంగనాథ్, మేనేజర్ నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ధ్యానమోని శాంతమ్మ శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న కేఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డి, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్, టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్, బీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా ఒక్కో పార్టీ నేతలు రూ.5వేలు అందజేశారు.

వాహనదారుల ఇక్కట్లు

పరిగి: పట్టణ కేంద్రం నుంచి షాద్‌నగర్ వెళ్లే రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారింది. వర్షాలు కురుస్తుండటంతో ఇంతకు ముందున్న గోతులు పెద్దగా మారి.. వాహనదారులను ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. వెంటనే రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐని సన్మానిస్తున్న ఎంపీటీసీ రాములు

దోమ: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ రవి గౌడ్‌ను శనివారం ఎంపీటీసీ రాములు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. పోలీసులు గ్రామాల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. బొంపల్లి గ్రామ ఉపసర్పంచ్ రఫిక్ పాష, బీఆర్‌ఎస్ నేతలు షఫీ, వెంకటయ్య పాల్గొన్నారు.

మండల నాయబ్ ఖాజీగా మహమ్మద్

బొంరాస్‌పేట: దుద్యాల మండలానికి నాయబ్ ఖాజీగా మహమ్మద్ మొయిజ్‌ను మత పెద్దలు శనివారం నియమించారు. ఈ మేరకు శనివారం నియామక పత్రం అందజేశారు. మండలంలో జరిగే ముస్లిం వివాహాలను ఇక నుంచి ఈయన జరిపిస్తారని తెలిపారు. తాండూరులోని తజ్వీదుల్ ఖురాన్ మదర్సాలో కొడంగల్, తాండూరు నియోజకవర్గాలకు ఖాజీ మౌలాన, షబ్బీర్ పహట్ కొనసాగుతారు. మజీద్ సదర్ సయ్యద్ రఫీ, ఇమామ్ జావిద్, కార్యదర్శి ఫరీద్, సభ్యులు ఇక్బాల్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో యువజన సంఘం సభ్యులు

కొడంగల్ రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. గాంధీనగర్ కాలనీలో ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరిందని, నిలిచిపోయిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి చేయించాలని, ఎస్సీల శ్మశానవాటికకు రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని, సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చినట్లు సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్‌బాబు, పట్టణ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు రమేష్, అశోక్, ప్రధాన కార్యదర్శి మధుకుమార్, కేశవులు, బీఆర్‌ఎస్ టౌన్ ప్రెసిడెంట్ రమేష్‌బాబు, దస్తప్ప, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు మేకల పాలు



తాండూరు–హైదరాబాద్ రోడ్డు మార్గంలో డివైడర్ల మధ్యలోని మొక్కలను తింటున్న మేకలు

తాండూరు టౌన్: తాండూరు పట్టణం ఇందిరాచౌక్ నుంచి రాజీవ్ కాలనీ వరకు డివైడర్ల మధ్యలో నాటిన మొక్కలు.. మేకలకు మేతగా మారాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇటీవల పలు రకాల మొక్కలు నాటి.. వాటి చుట్టూ కంచె వేయడం మరిచిపోయారు. దీంతో నాటిన మొక్కలు మేకలకు ఆహారంగా మారాయి. అధికారులు స్పందించి మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



కళాజాతలో మాట్లాడుతున్న సీఐ

దౌల్తాబాద్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొడంగల్ సీఐ రాములు అన్నారు. స్థానికంగా శనివారం నిర్వహించిన కళాజాత బృందంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గ్రామాల్లో ఏదైనా అత్యవసరం ఏర్పడితే 100కు డయల్ చేయాలని, శాంతిభద్రతల విషయంలో పోలీసులు ఎనలేని కృషి చేస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్‌కుమార్, ఏఎస్‌ఐ ముత్తురాజు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యలకు పరిష్కారం

తాండూరు: గౌడ కులస్తుల ఐక్యతతోనే అన్ని రంగాల్లో సాధికారత వస్తుందని గౌడ సంఘం తాండూరు అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్‌రాజుగౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని పొట్లి మహరాజ్ దేవాలయంలో సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 18న సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ జయంతి సందర్భంగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా గౌడలు విద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయాల్లో వెనుకబడి ఉన్నారన్నారని చెప్పారు. ఐకమత్యంగా ఉంటేనే అన్ని రంగాల్లో రాణిస్తామని పేర్కొన్నారు. సర్దార్ జయంతి సందర్భంగా పట్టణంలో 10వేల మందితో బైక్‌ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ప్రభాకర్‌గౌడ్, నర్కుల నరేందర్‌గౌడ్, రాజన్‌గౌడ్, సతీష్‌గౌడ్, వెంకన్నగౌడ్, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



అనంతగిరి: నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు, కేవీపీఎస్ నాయకులు

అనంతగిరి: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించడమే కాకుండా.. లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. శనివారం విద్యార్థినులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

దౌల్తాబాద్: మహిళలను చిత్రహింసలకు గురిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు శ్యాంసుందర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

పట్టించుకోని ప్రభుత్వాలు..

పరిగి: మణిపూర్‌లో కుకి తెగకు చెందిన ఆదివాసి మహిళలను నగ్నంగా ఊరేగించి, లైంగిక దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య అన్నారు. ఈ సందర్భంగా పరిగి బస్టాండ్ ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, మణిపూర్ సీఎం దిష్టి బొమ్మలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

జర్నలిస్టుల అభ్యున్నతికి కృషి

అనంతగిరి: జర్నలిస్టుల అభ్యున్నతికి తనవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టు కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. పలు సమస్యలు వివరిస్తూ.. వాటిని పరిష్కరించాలని పాత్రికేయులు కోరగా.. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.